క్లుప్తంగా

విద్యతోనే బంగారు భవిష్యత్

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్, షీల్డ్ అందజేస్తున్న మంత్రి సీతక్క

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతోనే బంగారు భవిష్యత్ ఏర్పరచుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలోని ఎన్టీఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, షీల్డ్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ చైర్మన్ భువనేశ్వరి, విశ్రాంత ఐఏఎస్ అధికారి సాంబశివరావు, ఎస్వీ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ఏ దామోదర్, విశ్రాంత ఐపీఎస్ రాజేంద్రకుమార్, ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవో గోపి, విద్యాసంస్థల అకాడమిక్ డీన్ ఎంవి రామారావు, హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల రవియాదవ్, మాజీ జెడ్పీటీసీ కంజర్ల భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది'లో ప్రతిభ కనబర్చాలి

పీఏసీఎస్ గుండాల చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి



స్టడీమెటీరియల్ పంపిణీ చేస్తున్న బుచ్చిరెడ్డి

చేవెళ్ల: పదోతరగతిలో విద్యార్థులు మంచి మార్కులతో గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని గుండాల పీఏసీఎస్ చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి అన్నారు. గుండాల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం పదోతరగతి విద్యార్థులకు ఆయన స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాగా చదువుకుంటేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గుండాల పాఠశాలలో సౌకర్యాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సౌకర్యాన్ని పదోతరగతి విద్యార్థులు ఉపయోగించుకొని జిల్లా, మండలస్థాయిలో మొదటిస్థానంలో నిలిచేలా చదవాలన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు

వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య



దామర్లపల్లిలో వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్

షాబాద్: ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం దామర్లపల్లి గ్రామంలో చేవెళ్ల పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 185 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య పరీక్షలో 60మందిని ఆపరేసన్ కోసం గుర్తించిన్నట్లు, వారిని సోమవారం ప్రత్యేకంగా బస్సుల్లో తీసుకువెళ్లి చేవెళ్ల ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోకుల లింగం, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు అభినందనల వెల్లువ

చేవెళ్ల: సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపికైన చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ అనురాధను ఉపాధ్యాయులు సుధాకర్, సంతోష, అధ్యాపకులు శేషాద్రిలు అభినందించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అనురాధను కలిసి అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని తెలిపారు.



అనురాధను సన్మానిస్తున్న సుధాకర్, సంతోష

రోడ్లన్నీ గుంతలమయం!

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- నిధులు మంజూరైనా మొదలు కాని పనులు
- ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో జనం



గుంతలమయంగా వెంకటాపూర్-కనకమామిడి రోడ్డు

మొయినాబాద్: రోజురోజుకు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. కంకర తేలుతూ గుంతలమయంగా తయారవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. పదేళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. రోడ్డు పనుల కోసం అభివృద్ధి నిధులు మంజూరైనా ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. దీంతో నేటికీ పనులు మొదలు పెట్టలేదు. మొయినాబాద్ మండలంలోని పది గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వం 2023, ఆగస్టులో సుమారు రూ.24 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సెప్టెంబర్‌లో శంకుస్థాపనలు సైతం చేశారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు చేపట్టలేదు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు పనులు జరగడం లేదు.

ఇబ్బందుల్లో వాహనదారులు..

మొయినాబాద్ మండలంలోని పెద్దమంగళారం-చందానగర్, ఎన్కేపల్లి-బాకారం, నక్కలపల్లి-వెంకటాపూర్, సురంగల్-వెంకటాపూర్, మొయినాబాద్-ముర్తుజగూడ, కనకమామిడి-వెంకటాపూర్, తోలుకట్ట-ఎత్‌బార్‌పల్లి-నక్కలపల్లి, నాగిరెడ్డిగూడ-బాకారం గ్రామాల రోడ్లు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. ఆయా గ్రామాల రోడ్లను పదేళ్లుగా పట్టించుకోలేదు. 2014లో కొన్ని రోడ్లకు రీ బీటీ వేశారు. ఆ తరువాత ఇంత వరకు మరమ్మతులు చేపట్టలేదు. మూడేళ్లుగా వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులు ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఐదు నిమిషాల్లో పూర్తి చేయాల్సిన దూరాన్ని అరగంటకు పైగా సమయం పడుతుంది.

రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



రోడ్డు పనుల నిమిత్తం ఎన్నికల ముందు నిధులు మంజూరు చేసి ఉరుకులు, పరుగులతో శంకుస్థాపనలు చేశారు. కానీ ఇప్పటి వరకు పనులను చేపట్టలేదు. రోడ్లన్నీ గుంతల మయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని పట్టించుకొని త్వరగా రోడ్డు పనులు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి.

గణేశ్, చందానగర్, మొయినాబాద్

టెండర్లు కొనసాగుతున్నాయి



మండలంలోని కొన్ని గ్రామాల రోడ్లకు ప్రభుత్వం ఆరు నెలల క్రితం నిధులు మంజూరు చేసింది. కొన్ని రోడ్లకు టెండర్లు పూర్తయ్యాయి. మరి కొన్ని రోడ్డు పనులకు టెండర్లు కొనసాగుతున్నాయి. శ్రీరాంనగర్-అమ్డాపూర్ రోడ్డు పనులు మాత్రం జరుగుతున్నాయి. త్వరలో మిగితా రోడ్డు పనులను చేపడుతాం.

విజయ్‌కుమార్, డీఈఈ, మొయినాబాద్

నిధులు మంజూరైనా మొదలు కాని పనులు

- కనకమామిడి-వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.6.5 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ పూర్తయి కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా అయ్యింది. కానీ ఇంత వరకు పనులు మొదలు పెట్టడంలేదు.
- పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు అభివృద్ధికి రూ.2.80 కోట్లతో అధికారులు టెండర్ పిలిచారు. దీంతో ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతుంది.
- శ్రీరాంనగర్-అమ్డాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.3.50 కోట్లు మంజూరు కావడంతో పనులు జరుగుతున్నాయి.
- తోలుకట్ట-నక్కలపల్లి రోడ్డుకు ప్యాచ్ వర్క్ కోసం రూ.1.20 కోట్లు మంజూరైనా టెండర్ దశలోనే ఉంది.
- నక్కలపల్లి-వెంకటాపూర్ రోడ్డులో కల్వర్టు నిర్మాణం, ప్యాచ్ వర్క్ కోసం రూ.38.50లక్షలు మంజూరైనా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు.
- సురంగల్-వెంకటాపూర్ రోడ్డు అభివృద్ధికి రూ.1.20 కోట్లు నిధులు మంజూరైనా టెండర్ దశలోనే ఉంది.
- ఎన్కేపల్లి-బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు మాత్రం పిలిచారు.
- నాగిరెడ్డిగూడ-బాకారం రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో టెండర్ ప్రక్రియ జరుగుతుంది.
- మొయినాబాద్-ముర్తుజగూడ-అమ్డాపూర్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.30 కోట్లు మంజూరు చేశారు. టెండర్ కూడా పూర్తి చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని సమావేశ మందిరంలో ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు పార్టీలకతీతంగా అభివృద్ధిపై దృష్టిపెట్టాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి పక్షపార్టీలకు చెందిన నేతలు ఉన్న గ్రామాల్లో సక్రమంగా రోడ్లు వేయకుండా పక్షపాత వైఖరి అవలంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అసంపూర్తిగా ఉన్న ఎంపీడీఓ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. నందిగామ నుంచి నర్సప్పగూడ మీదుగా చేగూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లు అంచనా వేశారని, చంద్రాయన్‌గూడ నుంచి మామిడిపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పారు.

సభలో చర్చించిన అంశాలు..

- అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి జంగోనిగూడ వరకు సీసీ రోడ్డు వేసి రోడ్డుకు ఇరువైపుల మట్టి పోయలేదని, దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఎంపీటీసీ కుమారస్వామి గౌడ్ సభ దృష్టికి తెచ్చారు.
- మేక గూడకు జనాభా ప్రాతిపదికన మిషన్ భగీరథ నీరు రావడం లేదని సర్పంచ్ పాండురంగా రెడ్డి అధికారులతో చెప్పారు.
- అంతిరెడ్డిగూడ గ్రామ పంచాయతీగా ఏర్పడినా కూడా బోర్డు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఎంపీటీసీ కుమార స్వామి గౌడ్ అధికారులను ప్రశ్నించారు.
- డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగలేదని, తిరిగి మళ్లీ ఎంపీక చేయాలని ఎంపీటీసీ కొమ్ము కృష్ణ సభలో పేర్కొన్నారు.
- గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసే సమయంలో మట్టి అవసరం ఉంటుందని, చెరువు, కుంటల్లో తీస్తే అధికారులు కేసులు పెడుతున్నారని, గ్రామ అవసరాలకోసం అనుమతులు ఇవ్వాలని అప్పారెడ్డిగూడ సర్పంచ్ జేకే నర్సింహా తెలిపారు.
- వీర్లపల్లి రోడ్డును గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఎమ్మెల్యే వీర్లపల్లి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని వీర్లపల్లి సర్పంచ్ చిందం రాములమ్మ కోరారు.
- వెంకమ్మగూడకు 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రజనీ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేష్, వైస్ ఎంపీపీ మంజుల, తహసీల్దారు అయ్యప్ప, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు కాట్న లత, ఎంపీటీసీ కలమ్మ, చంద్రపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చినందుకు పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. దారా యాదయ్య, నర్సప్పగూడ జంగయ్య, బంటారం వితలయ్య, కృష్ణ, వినయ్ కుమార్, అబ్దుల్ ఘనీ, వెంకట్ రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీద్ మామిడిపల్లిలో..

మాజీద్ మామిడిపల్లిలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించారు.

మండల స్థాయి చెకుముఖి పోటీలు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

కేశంపేట: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ పోటీలను జెడ్పీఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. 8, 9, పదోతరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తెలుగు మాధ్యమంలో ఎక్లాస్‌ఖాన్‌పేట జెడ్పీపాఠశాలకు చెందిన దీపిక, రాంచరణ్, అక్షితలు, ఆంగ్ల మాధ్యమంలో కేశంపేట జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన అంజలి, వరుణ్, అమీనాలు, ప్రైయివేట్ పాఠశాలల విభాగంలో గ్లోబల్ స్కూల్‌కు చెందిన తేజశ్రీ, సమ్మెక్, శరణ్యలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నియోజకవర్గ కోఆర్డినేటర్ కొమురయ్య, ఉపాధ్యాయులు అపర్ణ, యాదయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



ట్రాఫిక్ నిబంధనల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ రవీందర్‌నాయక్

ఎస్‌ఐ రవీందర్‌నాయక్

కొత్తూరు: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ రవీందర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం కొత్తూరు పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు ఆయనతో పాటు పలువురు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు సైతం విద్యార్థులు ట్రాఫిక్ పద్ధతులను తెలియజేయాలన్నారు. కూడళ్ల వద్ద రోడ్డు దాటే సమయంలో ఏ వైపునకు తిరుగుతున్నామో ఆ వైపును సూచించే ఇండికేటర్ వేయాలని వాహనదారులకు సూచించారు. వాహనాలను ఓవర్‌టేక్ చేసే సమయంలో అనుసరించాల్సిన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. అంతేకాకుండా జనసంచారం ఉన్నదగ్గర, పాఠశాలల ప్రాంగణంలో వాహనాలను చాలా నెమ్మదిగా నడపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రోడ్డుకు వ్యతిరేక దిశలో వాహనాలు నడపొద్దన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంగోర్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు తొలగించొద్దని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఓటర్లు

కేశంపేట: కాకునూర్ గ్రామానికి చెందిన కొందరు తమ ఓటు హక్కు తొలగించొద్దని కోరుతూ నాయబ్ తహసీల్దార్ గీతకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ దరఖాస్తులను స్వీకరించిన నేపథ్యంలో కొందరు కాకునూర్ గ్రామస్తులు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారికి అధికారులు ఓటు హక్కు కల్పించారు. ఈ విషయంలో కొందరు రాజకీయ పార్టీల నాయకులు జోక్యం చేసుకొని చాలా రోజుల క్రితం గ్రామం నుంచి వెళ్లిన వారు అక్కడే ఓటు హక్కు కలిగి ఉన్నారని, మరి కొందరు మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని ఓతండాకు చెందిన వారు, గ్రామంలో స్థిర నివాసం లేనివారు కూడా దరఖాస్తు చేసుకున్నట్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ఆర్డీఓకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధిత ఓటర్లు సోమవారం షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో హియరింగ్‌కు హాజరు కావాలని అధికారులు నోటీసులు పంపించారు. నోటీసులను అందుకున్న వారు శనివారం నాయబ్ తహసీల్దార్‌కు తమ ఓటు హక్కును తొలగించొద్దని, తాము బతుకు దెరువుకోసం పనుల నిమిత్తం వెళ్లొచ్చినట్లు చెప్పారు. తాము మాత్రం కాకునూర్‌లోనే ఉంటున్నట్లు వినతిపత్రంలో ఓటర్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

శ్రీరాంనగర్ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి



అశోక్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంనగర్ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మానుక అశోక్ సొంత నిధులతో నిర్మించిన వేదికను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత అశోక్‌ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు వారు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఎంపీటీసీ రాంరెడ్డి, వార్డు సభ్యులు యాదయ్య, చంద్రయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీనుగౌడ్, పంచాయతీ కార్యదర్శి సజనామశ్రీ, శివశంకర్, జంగారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

టీచర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రయ్య



బోరు ప్రారంభిస్తున్న రాంచంద్రయ్య

శంకర్‌పల్లి: కాలనీ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని శంకర్‌పల్లి టీచర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచంద్రయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీలో జి కృష్ణారెడ్డి సొంత నిధులతో వేయించిన బోరును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంచంద్రయ్య మాట్లాడుతూ కాలనీలో మంచి నీటి ఇబ్బందులు ఉన్నాయని కాలనీ వాసులు తెలపడంతో కృష్ణారెడ్డి ముందుకొచ్చి బోరు వేయించారన్నారు. కాలనీ అభివృద్ధికి మున్సిపల్ అధికారులు కూడా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు చంద్రమౌళి, సంధ్యారాణిఅశోక్ కుమార్, కాలనీ జనరల్ సెక్రటరీ సంజీవ రావు, సభ్యులు అనంత్‌రెడ్డి, రాజ్ సింగ్ శ్రీనివాస్, విఠల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

- రాష్ట్ర సర్పంచుల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ



విజేతకు ట్రోఫీ ప్రదానం చేస్తున్నశోభ

మొయినాబాద్ రూరల్: యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సర్పంచుల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ పేర్కొన్నారు. వారం రోజుల క్రితం ఆయా గ్రామాల్లోని యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శనివారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ క్రీడలతో శరీరం ధృడంగా ఉండడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సిద్ధయ్య, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రీతంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, వంశీరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరం



నోట్ పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ కావలి మల్లేశ్

హైతాబాద్ సర్పంచ్ కావలి మల్లేశ్

షాబాద్: పేద విద్యార్థులకు దాతలు సహకరించాలని హైతాబాద్ సర్పంచ్ కావలి మల్లేశ్ పేర్కొన్నారు. శనివారం హైతాబాద్ ప్రాథమిక పాఠశాలలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన జీఎంఆర్‌ఐటీ కళాశాల మొదటి బ్యాచ్ (1997-2001) పూర్వ విద్యార్థులు పాఠశాలకు రెండు గ్యాస్ కనెక్షన్‌తో పాటు విద్యార్థులందరికీ నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివితేనే మంచి ఫలితాలు సాధించొచ్చని చెప్పారు. పాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని చదువుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్‌ఐటీ కళాశాల బృందం శామ్యూల్, శ్రీనివాస్, చౌదరి, గోపాల్, గంగిడి భూపాల్‌రెడ్డి, చర్ల కుమార్, రామకృష్ణ, ఇస్తారయ్య, జంగయ్య, సత్యనారాయణ, కావలి కుమార్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం బలోపేతానికి కృషి

బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెబాబయ్య



నూతన కమిటీ సభ్యులను సన్మానించిన సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ముదిరాజ్ సంఘాన్ని గ్రామగ్రామాన బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు అందెబాబయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు గుంటిశంకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందెబాబయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందన్నారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను పట్టించుకోకపోవడంతోనే వారు అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురయ్యారన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం మహాసభ తాలుక కన్వీనర్‌గా మంగ వెంకటేశ్, కో కన్వీనర్లుగా కానుగు భూపాల్, సంద శ్రీనివాస్, మల్లేశ్ పూజారి, గుడిసె బాల్‌రాజ్, తోట్ల రాఘవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా బైరమోనిమహేశ్‌ను ఎన్నుకున్నారు. ముదిరాజ్ సంఘం తాలుక యూత్ కన్వీనర్‌గా శ్రీధర్‌వర్మ, కో కన్వీనర్‌గా మంగ అశోక్‌ను ఏకగ్రీవంగా నియమించారు. నూతన కమిటీ సభ్యులను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంచరాములు, అందెపైలయ్య, జంగయ్య, అనంతయ్య, సత్తయ్య, యాదయ్య, బాల్‌రాజ్, సత్యనారాయణ, మదన్ మోహన్, నీరటివాసు, తదితరులు పాల్గొన్నారు.